

# బాల వికాసం

6

## బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల




ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్. శర్మ కలం నుండి జాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

ఓ ఐదారు నిమిషాల నడక తర్వాత వాళ్ళు ఆ మడుగు దగ్గరికి చేరుకున్నారు. కొంత దూరంలో చుట్టూ ఉన్న గుట్టల మీది నుంచి, అడవి లోంచి పారుతూ వచ్చిన నీళ్ళతో ఏర్పడ్డ పెద్ద మడుగు అది. ఓ పెద్ద సరస్సులా ఉంది. దాని చుట్టూ ఎన్నో బండరాళ్ళు, పొదలు, ఏపుగా నిలువెత్తు పెరిగిన గడ్డి, ఎత్తయిన చెట్లు, చుట్టూరా ఆవరించి ఉన్న అడవి, ఏమాత్రం జన సంచారం కనిపించని ప్రదేశం. "నిజమే మధూ! నీ అభిప్రాయం వందశాతం సరైంది. ఈ చోటును వన్య ప్రాణులనూ, పులులనూ ఆకర్శించే ప్రదేశంగా అద్భుతంగా తీర్చి దిద్దవచ్చు. ఇక్కడ ఎండాకాలం కూడా నీళు ్ళ ఉండేలా చేయొచ్చు. ఆ దృశ్యాన్ని ఊహిస్తూ అన్నాడు కులకర్ణి. ఆ పెద్దాయన కూడా తన ఆలోచనను బలపరిచినందుకు మధుసూదన్ సంతోషపడుతూ "ఓ పులులారా!రండి! ఇక్కడ మీకోసం ఓ కొత్త విడిదిని ఏర్పాటు చేస్తున్నాం!" అని నోటికి రెండు వైపులా అరచేతుల్ని పెట్టుకొని, ఓ చిన్న పిల్లాడిలా గట్టిగా అరిచి, నవ్వేశాడు.

వాళ్ళు అలా మాట్లాకుంటుంటే బాలవర్ధన్ అక్కడికి కొంత దూరంలో ఉన్న వెదురు చెట్ల పొదల వెనుకకు వెళ్లడం వాళ్లు గమనించ లేదు. ఎస్కార్టు మారుతి దృష్టి కూడా తమ అధికారుల మీదే ఉంది. బాలవర్ధన్ అటువైపు వెళ్ళడం అతడు యథాలాపంగా చూశాడు. కానీ అతడు ప్రకృతి పిలుపుకోసం వెళుతున్నాడని అనుకున్నాడు.

"తాతా!..సార్... ఇది చూడండి!" అన్న అరుపు వినిపించి కులకర్ణి మధుసూదన్‌లు తమ మాటల్లోంచి బైటపడి, అటు వైపు చూశారు. ఆ వెదురు పొదలున్న వైపు నుంచి వేగంగా అడుగులు వేసుకుంటూ వీళ్ల వైపు వస్తున్నాడు బాలవర్ధన్. వీళ్ళకు ఓ యాభై అడుగుల దూరంలోకి వచ్చేశాడు. ఆ దృశ్యం వాళ్ళను ఆశ్చర్యానికీ, భయానికీ గురిచేసింది. తెలియకుండానే ఓక్షణం వాళ్ళ ఒళ్ళు గగుర్పాటుకు గురైంది. బాలవర్ధన్ రెండు చేతుల మధ్యన ఉందో పులిపిల్ల...ఓ కుక్కపిల్లను ఎత్తుకున్నట్టు రెండు చేతులతో ఎత్తుకుని వస్తున్నాడు. వాళ్ళకు అది కలో, భ్రాంతో అనిపించిందో క్షణం. తాము పులులను ఇక్కడికి ఆకర్శించడం గురించి మాట్లాడుతున్నారు, ఈ పిల్లాడు పులిపిల్లను ఇక్కడికి ఎత్తుకుని వస్తున్నాడు...నమ్మలేనట్టు చూస్తూ, గబగబా బాలవర్ధన్ వైపు కదిలారు. దగ్గరికి రాగానే అడిగారు "ఎక్కడ కనిపించిందిది?!" వాళ్ళ గొంతుల్లో సంభ్రమం!...

"అదిగో, ఆ వెదురు పొదల్లో పడివుంది. నడుంమ్మీదా, వెనుక కాళ్ళమీదా అంతా ఈ నెత్తురు. ఏవో గాయాలైనట్టున్నాయి. ఏంజరిగిందో తెలియదు. కదలలేక పోతున్నది. దీనంగా ఓ పిల్లిపిల్లలా అరుస్తున్నది...పాపం."

"మరి, తల్లిపులి కనిపించ లేదా?" ఆందోళనతో అడిగాడు మధుసూదన్.

"లేదంకుల్. నేనక్కడ చాటుకు నిలబడి చుట్టూ అంతా చూశాను. ఎక్కడా దీని తల్లి జాడ లేదు. అక్కడ దీని తల్లి ఉంటే నేను ప్రాణాలతో ఇలా వచ్చేవాణ్ణి కాదు. దగ్గరికి వెళ్ళేముందు ఓ చిన్న రాయి కూడా విసిరి చూశాను. తన పిల్లల జోలికి వస్తే దేన్నీ అది ప్రాణాలతో విడిచి పెట్టదని నేను చదివాను. బహుశా దీని తల్లికి ఏదో జరిగి ఉంటుంది." చెప్పాడు బాలవర్ధన్. "నిజమే, పులి ఈనడానికి అనువైన ప్రదేశాన్ని ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటుంది. ఎంతో సురక్షితమైన ప్రదేశంలో ఓ కొండగుహ లాంటిది చూసుకుంటుంది. కానీ ఇలాంటి చోట ఈ పులిపిల్ల మాత్రమే ఉండడం...ఊహించడానికి వీలు కావడంలేదు..." అంటూ కులకర్ణి ఆ పులిపిల్ల గాయాలను పరిశీలించాడు. దాని కాళ్ళమీదా, నడుంమ్మీదా చర్మం లేచిపోయి, లోపలి మాంసం కనబడుతున్నది. రక్తం కారడం ఆగిపోయినా ఇంకా తడిగానే అనిపిస్తున్నది.

"పులిపిల్లలు కనీసం ఇరవై నెలలు తల్లితోనే ఉంటాయి. తల్లి మీదే ఆధారపడి ఉంటాయి. దీనికి ఓ మూడు నాలుగు వారాల వయసు ఉంటుందేమో. మరి తల్లి లేకుండా ఈ పిల్ల ఇక్కడ ఎలా వుంది? తల్లి దీన్ని విడిచి ఎక్కడికి పోయింది?...ఆ తల్లి కేమైనా ఆపద కలిగిందేమో! ఈ స్థితిలో ఎలాగూ బతికేలా లేదనుకుని మిగతా పిల్లల్ని కాపాడుకోవడానికి దీన్ని తప్పనిసరై వదిలేసి వెళ్ళిందేమో! లేదా మరో జంతువేదైనా దీన్ని ఎత్తుకొచ్చిందేమో!" రకరకాల కారణాలు ఊహిస్తున్నాడు మధుసూదన్.

"ఇది చాలా నీరసంగా, చావు బతుకుల్లో ఉన్నట్టుందంకుల్. దీన్ని ఇలా వదిలేసి వెళ్ళిపోతే చచ్చిపోతుంది. దీన్ని ఎలాగైనా మీరే కాపాడాలి!" దాన్ని జాలిగా చూస్తూ అన్నాడు బాలవర్ధన్.

"సర్, ఇక్కడ ఎక్కువ సేపు ఉండడం మంచిది కాదు" తుపాకిని పొజీషన్లో పట్టుకొని, చాలా సేపట్నుంచి అలర్టుగా కవర్ చేస్తున్న మారుతి అన్నాడు.

"నిజమే. చీకటి పడేలోగా మనం జిన్నారం చేరుకోవాలి. మా పైఅధికారులకూ, ఇక్కడి అధికారులకూ ఈ విషయం రిపోర్టు చేయాలి. దీనికి జిన్నారంలో ప్రాథమిక చికిత్స చేయించాలి. దీన్ని కాపాడే ఏర్పాట్లు చేయాలి. ఇంకా చాలా పనులూ, ఫార్మాలిటీస్ ఉంటాయి కదా!" అంటూ తమ జీపు ఆగివున్న వైపు కదిలాడు మధుసూదన్.

"బాబూ, దాన్ని ఇలా ఇస్తావా!" అంటూ ఆ పులిపిల్లను తన చేతుల్లోకి తీసుకోబోయాడు ఎస్కార్టు మారుతి.

"ఫరవా లేదంకుల్. అక్కడి వరకు నేనే తెస్తాను. పదండి" అంటూ, దాన్ని ఆప్యాయంగా తన హృదయానికి హత్తుకుని ముందుకు నడిచాడు బాలవర్ధన్. ఆ పులిపిల్ల మెల్లగా కొద్దిగా కళ్ళు తెరిచి బాలవర్ధన్ వైపు చూసి, మళ్ళీ నిస్సత్తువగా కళ్ళు మూసుకుంది.

"మీ మనుమడు చాలా గ్రేట్ సర్. ఇంత ధైర్యంవున్న బాబు మీ మనుమడైనందుకు మీరు గొప్ప అదృష్టవంతులు!" ఎస్కార్టు కులకర్ణిని అభినందించాడు. వాళ్ళు జీపు దగ్గరికి వచ్చేదాకా చాలా ఎలర్టుగా పరిసరాలు గమనిస్తూ జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చారు.

"రామన్నా, దీన్ని లోపలికి తీసుకో!" అంటూ, జీపులోంచి ముందుకు వంగి ఆశ్చర్యంగా చూస్తున్న రాముకు తన చేతుల్లోని పులిని అందించాడు బాలవర్ధన్. ఎండిపోయిన రక్తపు మరకలతో బతికి ఉందో చచ్చిపోయిందో తెలియకుండా ఉ



న్నదది. దాన్ని జాగ్రత్తగా అందుకొని, లోపలికి తీసుకున్నాడు రాము.

జీపు బయల్దేరింది. అది ఎక్కడ కనిపించిందో ఆ వివరాలు రాముకు చెప్పాడు బాలవర్ధన్. మధుసూదన్ జిన్నారంలో ఉన్న అటవీశాఖ అధికారికి ఫోన్లో విషయాన్ని చెప్పాడు. తాము వచ్చేసరికి వెటర్నరీ డాక్టర్‌ను సిద్ధంగా ఉంచుమని చెప్పాడు. ఇంకా కొందరు తన పైఅధికారులకు, డివిజనల్ కార్యాలయానికి ఫోన్ చేశాడు.

కులకర్ణి కూడా కొందరు అధికారులతో మాట్లాడాడు.

వాళ్ళు జిన్నారం చేరుకుని ఆ పులిపిల్లకు చికిత్స చేయించి, పైఅధికారుల సూచన మేరకు ఆరోజుకు దాన్ని అక్కడే వైదుని పర్యవేక్షణలో ఉంచారు. 'ప్రాణాపాయం ఏమీ లేదని, త్వరలోనే తగ్గిపోతుందని' ముప్పై ఏళ్ళకు పైగా అనుభవం ఉన్న ఆ డాక్టర్ చెప్పాడు. "అంకుల్! దీనికి బాగయిన తరువాత ఎలాగైనా దీన్ని తల్లి దగ్గరికి చేర్చే ప్రయత్నం చేస్తారా?" అని మధుసూదన్‌ను అడిగాడు బాలవర్ధన్. తల ఆడించాడు అతడు. అక్కడినుంచి వాళ్ళు బయలుదేరే ముందు ఆపులి నుదురు మీద ప్రేమగా చేత్తో నిమిరాడు బాలవర్ధన్. అది చురుగ్గా కళ్ళు తెరిచి బాలవర్ధన్ ముఖంలోకి చూస్తూ, మెల్లగా పలకరించినట్టు అరిచింది. అందరూ ఆశ్చర్యంగా చూశారు. "మళ్ళీ కలుద్దాం, ఓకేనా!" అంటూ దానికి వీడ్కోలు పలికాడు బాలవర్ధన్.

వాళ్ళు అక్కడ్నుంచి బయల్దేరి డాక్టర్ వెన్నెలను కలిసి, ఆమె డాక్టర్ రాజేశ్వర్ కోసం ఇచ్చిన మందులు తీసుకుని, తిరుగు ప్రయాణం ప్రారంభించేసరికి చీకటి పడింది. నిర్మల్ చేరేసరికి తొమ్మిదైంది. అక్కడ ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆదిలాబాద్‌కు బయలుదేరారు.

వాళ్ళు బయలుదేరుతుండగా మధుసూదన్ బాలవర్ధన్ దగ్గరికి వచ్చి షేక్‌హ్యాండ్ ఇస్తూ, "మై డియర్ బాలవర్ధన్! నీకు హృదయపూర్వక అభినందనలు! ఈ టైగర్ రిజర్వ్ తరఫునా, పులుల ప్రపంచం తరఫునా నీకు అభినందనలు! మనం మళ్ళీ కలుద్దాం, తప్పకుండా. ఆల్‌ద బెస్ట్ , బై !" అన్నాడు. ఆ మాటలు విన్న కులకర్ణి హృదయం మనుమణ్ణి చూసి గర్వంతో పొంగిపోయింది.

(సశేషం..)



–డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## బాల గేయం
## అందరి నాదరించాలి

పురాణ కథలను– సాంఘిక కథలను
బిరాన పిల్లలు చదవాలి!
మాతృభాషలో విద్యాబోధన–
మంచిగ గ్రహించి ఎదగాలి!
పశు పక్ష్యాదుల పాత్రల ద్వారా
"పంచతంత్రపు" కథలయందున
ప్రవచించిన పలు నీతి సారముల
ప్రత్యేకంగ గ్రహించాలి!
లోకమందలి మంచి–చెడులను
లోతుగా గమనించాలి!
చెడు సహవాసం చేసినచో
చెడిపోవుట గుర్తించాలి!
పెంచుకున్న విజ్ఞానంతో
మంచి కథలు రచియించాలి!
అమ్మానాన్నల గౌరవిస్తూ
బొమ్మలు గియనెంచాలి!
ఆటలు ఆడి పాటలు పాడి
అభివృద్ధులనే గాంచాలి!
అధర్మాల ఖండించాలి!
అసత్యాల త్యజియించాలి!
అనుభవజ్ఞులగు పెద్దలమాటల
వినయముగా పాటించాలి!
అనువుగ ఉపన్యసించాలి!
అందరి నాదరించాలి!



– డా॥ వద్దేపల్లి కృష్ణ
9246541699

## పిల్లలను వినండి

క్షణాలనుపచ్చనోట్లకింద మార్చేందుకు
ప్రతిక్షణం సంపాదనాయంత్రమౌతూ
మీ యింట్లో పిల్లల మాటలకు..
మమతలకు ఒక్కక్షణం కూడా సమయమివ్వలేని
తలిదండ్రులారా! దయచేసి..
మీపిల్లలను వినండి!
పెద్దబంగ్లాలకై తాపత్రయం
పెద్దకార్లమీదనే ఆలోచనలవ్యయం
కృత్రిమ పరువును కుప్పలుకుప్పలుగా
పెంచుకోవడమే ధ్యేయం.. ,
పెద్దలక్ష్యాలలోపడి చిన్నపిల్లల మనసుల్ని
చదివిందేందుకు అవకాశమివ్వలేని తలిదండ్రులారా!
దయచేసి మీ పిల్లల్నివినండి!
ఆలుమగల సంపాదన పగలూరాత్రీ పరుగులూ
డబ్బును డబ్బుచేసే ఆరాటాలు
ఆదాయాలను పెంచుకునేందుకు అలుపెరుగని పోరాటాలు
మీ యింట్లోపిల్లల కథలు,
కలలు పంచుకునేందుకు మాత్రం
దొరకని బిజీబిజీ తలిదండ్రులారా!
దయచేసి మీ పిల్లలను వినండి!
మీరు వినకపోతె మీ పిల్లలను మరెవరో వింటారు..
పిల్లలు చెప్పకమానరు
యెవరో వారిని దగ్గరగా వింటారు దగ్గరవుతారు..
మీరిచ్చె కార్పోరేటు చదువులు ..లక్షలఫీజులు... .,
కోట్లఆస్తులు మిమ్మల్ని వారికి దగ్గరివాళ్ళను చేయవు..
మీరు నడుస్తున్న ఏటియం లౌతారు..,
లేదా ఆన్లైను పేటియం లౌతారు..,
అపుడపుడు కన్పించే బ్యాంకులోనులౌతారు..!
మీరు వారిని బడిపిల్లలుగ వున్నపుడు వినండి...
కళాశాలలైనపుడూ వినండి..
మీరు వినకుంటె .. మరెవరో వింటారు.. దగ్గరౌతారు..
ఆకర్శిస్తారు.. స్నేహితులౌతారు..
ప్రేమికులౌతారు.. ఈవిషయం
యెవరో చెప్తేవిని
మీరు హతాశులౌతారు..!
చేతులుకాలుతాయి..
ఆకులప్రయత్నాలు మిావవుతాయి..!
ప్లీజ్ !
మీ పిల్లల్ని ప్రతిరోజూ వినండి.. యేదోవొకటి అనండి..
మీరుయింట్లో పిల్లలకిచ్చే సమయమే
నేటి మీ సంపాదన..
ఆత్మీయత అందుకున్న పిల్లలుగా వారు
యెదగడమే మీ అసలు ఆస్తి.. !



– డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

## పల్లె..పట్నం

పాడి పంటలతో విలజిల్లును పల్లెలు
కార్మాగారాలతొ కలకలలాడును పట్నాలు
స్వచ్ఛమైన గాలికి కన్నతల్లి పల్లెలు
కాలుష్య ఖనిజాలు పట్నాలు
నాగరికతకు ఆయువు పట్టు పల్లెలు
నవీన నాగరికతకునిలయాలు పట్నాలు
ఆత్మీయతకు ఆలంబన పల్లెలు
ఒంటరి బ్రతుకుల మెతుకులు పట్నాలు
పొలం పనులకు బలం పల్లెలు
ఉద్యోగుల క్షేత్రాలు పట్నాలు
నిశ్శబ్దాని నిలువెత్తు నిదర్శనం పల్లెలు
రణగుణ ధ్వనులకు నిదర్శనం పట్నాలు
రైతులే రారాజులు పల్లెలందు
నాయకులే రారాజులు పట్నమందు
పూరిగుడిసెలు పెంకటింట్లు పల్లె ఆస్తులు
మేడలు మిద్దెలు పట్నం ఆస్తులు
ఎడ్లబండి ప్రయాణం పల్లెటూరు వాహనం
బస్సు ఆటో రైలు ప్రయాణం
పట్నం వాహనం



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## మత్తడి

చినుకులన్ని కలిసినయి
వరదలై సాగినయి
కుంటలు చెరువులు నిండినయి
మత్తడులు దుంకినయి
చేపలన్ని ఎగిరినయి
కప్పలన్ని దుంకినయి
కొంగలు జపం చేసినయి
బుడగలు మునిగి తిరిగినయి
ఎండ్రి కాయలు దాగినయి
నీటి పాములు ఉరికినయి
పిల్లలు పెద్దలు నీళ్ళతో ఆడినరు
మత్తడిలో ఈత కొట్టి మురిసినరు
ఆటపాటలతో కనువిందు చేసినరు



–ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## బాల గేయము

చిరు చీకటి ముసిరెను
నీడలేమో భయపెట్టే

అమ్మ దీపం వెలిగించి
గూటి లోన పెట్టెను

దీపంకు బొట్టుపెట్టి
చేతులెత్తి మొక్కెను

చీకట్లు తొలగిపోయి
వెలుగంతా వచ్చెను

భయమంతా పారిపోయి
సంతోషం వచ్చెను

దీపమే జ్ఞానమిచ్చునని
గురువు గారు చెప్పెను

సంధ్యవేళ దీపము
ప్రతి ఇంటికి శుభములిచ్చు

చదువుకునేటప్పుడు
నా వెంటే ఉంటుంది

అన్నం తినే నప్పుడు
అమ్మ చేతిలో ఉండును
పాఠాలు చెప్పినప్పుడు
నాన్న దగ్గర ఉండును

చిట్టి కథలు చెప్పినప్పుడు
నాయనమ్మ కే సొంతము

ఇల్లాలే ఇంటికి దీపమని
పెద్ద లంతా చెప్పిరి

దీపమే సర్వస్వమని
దేవుళ్ల నుడివిరి



–లక్ష్మి మదన్
9959186838

## ఓ..... జోన్

పుట్టుకతో
అంటిపెట్టుకున్నట్టు
కర్ణుని కవచకుండలాలుగా
కంటికి రెప్పలా కాచే
కన్నతల్లి పైట కొంగు

ఎండైనా వానైనా
ఎంటుండె తోడులాగ
కాపాడే గొడుగులాగా
కనిపెట్టుకు కాపాడే
కన్నతల్లి పైటకొంగు

ఏ దిష్టి పొంచుందో
ఏనుంచి ముంచేదో
ఆదమరిచి నువ్వున్నా
అతినీలపు కిరణాలను
అడ్డుకట్ట వేసినట్టు
అడ్డుకునే అమ్మ చెయ్యి

రంగులేని సంద్రానికి
రంగరించె నీలిరంగు
ఉప్పొంగకు నన్ను చేర
ఉప్పెనై ముంచకుండ
శాంతంగా ఉండమంటూ
సహోదరిలా సాకుతుంది.

నీ ఒంటికి గాయమైన
ఏ రోగం వచ్చునో.. !
ఏ కాన్సర్ ముంచునో.. !
ఇంత మంచి జీవరాశి
అందమైన ఈ ప్రకృతి
అగుపించకపోయేనో...!

ఏదో జోనులో
బందీకాకు బోనులో
భాద్యతగా కాపాడు
ఓ...జోను
భావి భారత బాలలకు
బహుమతివ్వు గ్రీన్... జోను



–వి. పద్మ, 9951445867

## పాడుతా.. తీయగా

ఆ వీధి
వాడికి కొత్తేం కాదు
గుప్పెడు పాటల్ని గుక్కిటపట్టి
పదే పదే తిరిగిందే!

సూర్యుడ్ని వెంటేసుకుని
ప్రొద్దున్నే బయల్దేరిన పాట
బారెడు ఎండకు
పూర్తిగా చార్జి అవుతుంది.

అలసిన గొంతును
వేడి వేడి చాయ్ నీళ్ళతో
ప్రక్షాళన చేస్తు
గుండెల నిండా
గుప్పు గుప్పుమనే
సిగరెట్టు పొగతో ఊపిరిలూదుకుంటాడు.

ఎవరు వింటున్నారో
ఏది విసిరేసి ఎవరు కొంటున్నారో
వాడికి పట్టదు.

పాటల్ని పోగేసుకుని
వీదుల్ని చుట్టబెట్టడం
సాయం కాలానికి
జేబులు సవరించుకోవడం

వాడి నిత్య కృత్యం
వాడికి తెలిసిందల్లా ఒక్కటే
పాడటం సంసార నౌక నడపటం
యిక చాల్లేమంటు
సూరీడు కృంగిపోయినా
కూనిరాగం మాత్రం
వాడి గొంతులో ప్రవహిస్తూనే వుంటుంది.
మత్తులో దాన్ని జోకొట్టి
చీకటి దుప్పట్లో ఒరుగుతాడు

తొలి కిరణాలు
మెళ్ళో వేలాడేసుకుని
పొద్దున్నే మళ్ళీ బయల్దేరుతాడు
'పాడుతా.. తీయగా' అంటు!



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## రాత గీత



### వెన్నెముక

ఎముకల గూడు
ఎల్లిన నరాలు
ముడతల తోలు
ముడ్డికి గోచి
పొట్ట చీల్చితే
ఆకలి.. అప్పులు
అసలు ఎవంన్నా నువ్వు?
తెలవదా తమ్మీ!
తెలంగాణ రైతును.




### డెమోక్రసి

ప్రపంచంలో కెల్లా
పగిలిన పెద్ద 'అద్దం'
మన ప్రజాస్వామ్యం
తొంగిచూస్తే..
ప్రజల మూతి ఓ చోట
ప్రభుత్వ ముక్కు మరోచోట



రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

పుస్తక సమీక్ష

# తెలంగాణలో బడిపిల్లల కవితా చైతన్యం మధుర పద్యాలు




సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్, అదే జిల్లా గుజ్జాల గొంది, వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాల బాలికలు వ్రాసిన 184 కవితలు మూడు సంకలనాలుగా వెలువడటం అభినందనీయం. **మధుర పద్మాలు** పుస్తకానికి, భైతి దుర్గయ్య, **గుజ్జాలగొంది మువ్వలు బాల లయలు**కు వరుకోలు లక్ష్మయ్య, **గడ్డిపూలు** సంకలనానికి వెన్నెల సత్యం సంపాదకులుగా వ్యవహరించారు. పాఠాలు బోధించటమే కాకుండ, కవితా వ్యాసంగాన్ని ప్రోత్సహించటం, పిల్లల ఫోటోలతో పుస్తకాలుగా ప్రచురింప చేయటం తెలంగాణ సాహితీ సృజనాత్మక వికాసంలో అంతర్భాగంగా కొనసాగటం విశేషాంశం. నేటినిజం ఎడిటర్ బైస దేవదాస్ బాలచెలిమి ఎడిటర్ మణికొండ వేదకుమార్, బాలసాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, వదాన్యులు పిల్లల మానసిక వికాసానికి అందిస్తున్న చేయూత ప్రశంసనీయం.

'మధుర పద్మాలు' జక్కాపూర్ బడిపిల్లల సంకలనంలో 94 కవితలు వున్నాయి. అందులో 52 బాలికలు వ్రాసినవే. అందులో అమ్మను గురించి కోలాపురం అనూష, ఏదుల్ల పూజిత, నిమ్మల అశ్విత, బోయిని చామంతి, బాదనేని శ్రీజన, రాగుల భవిత, తోకల కావ్య, కయ్యాల శ్రావ్య, గోపాలపురం సాయినాథ్, కారంకంటి రేఖ ఆత్మీయంగా స్పందించారు. పిల్లల ఆలోచనలు కవితా రూపకంగా కొన్ని పాటల్లా, అంత్యప్రాసలతో తేట తెలుగు మాటలతో అలరిస్తున్నాయి. గురువు, ప్రకృతి, బడి, పల్లె, అక్కచెల్లి, రైతు, పర్యావరణం వంటి వివిధ అంశాలను బాల బాలికలు తమదైన భాష, భావాలతో కవితలుగా వినిపించారు. డబ్బు గురించిన కవితలో 'డబ్బు ఒక విచిత్రం దాని బారిన పడితే మన బతుకు చిందర వందరం' అంటుంది బచ్చుపల్లి శ్రావణి. సైకిల్ గురించి మట్టి తేజస్విని, అందం కవితలో ఎర్రం అఖిల, కాలుష్యం గురించి సారుగు అరవింద్, పావురం ఇతివృత్తంగా గురజాల రఘువర్ధన్ రెడ్డి, ఓటువిలువ గురించి ఎర్రం అంకిత్‌రెడ్డి వైవిధ్య ఇతివృత్తాలను కవితా రూపాలుగా అందించారు. పిల్లల హృదయాలలోని స్నేహం, అమ్మ, నాన్న, చెల్లి, గురువు బంధాలు, వారికి ఎరుకలోకి వచ్చిన ప్రతి అంశం, కవితలుగా స్పందింపచేసారు.

**గుజ్రాలగొంది, పాఠశాల బడిపిల్లల బాల లయలు** సంపుటిలో 82 కవితలు వున్నాయి. 6వ తరగతి బాలిక దుబ్బాక వైష్ణవి లేలేత హృదయం బడి గంటను వినిపించినా, 7వ తరగతి బెజుగాం అర్చన మట్టి గణపతిని చెరువులో వేయాలన్నా, 10వ తరగతి బాలుడు దూలం అరవింద్, ఆకాశంలో వింతలను వినిపించినా, 8వ తరగతి పాతర్ల హర్షిత ఇండ్లు లేని నిరుపేదలకు ఇవ్వాలె ఇండ్లు ప్రభుత్వం అంటూ కోరినా, 8వ తరగతి సుదమల్ల శరణ్య, ఆడపిల్లకు జడ అందం అని సూచించినా, 6వ తరగతి అబ్దుల్ అఫీజ్ స్నేహమెపుడు క్షేమం అంటూ కలసిమెలసి వుండుమన్నా, 6వ తరగతి పాతర్ల జాషువా నాన్న అంటే ఇష్టం మాకెపుడు అంటూ ప్రేమ వ్యక్తీకరించిన మువ్వల చిరుసవ్వడి శ్రావ్యంగా వినిపించింది. నాన్నలపై గుజ్జాల గొంది గువ్వలం గుణాలలో మువ్వలం' అంటూ 8వ తరగతి బాలిక సింగరవేణి శ్రీజ, మా ఊరు ఇతివృత్తంగా వ్రాసిన కవిత, 'తెలంగాణ పాలన తేజమై వెలగాలి' అంటూ అభిలషించిన 10వ తరగతి శాతరాజు పల్లి హారిక, 'మా ఊరు దర్జీలు మా మంచి మనుషులు అంటూ 10వ తరగతి ఆరె శ్రావణి, తాళమే రక్షణై తల్లిగ కాపాడును" అంటూ 10వ తరగతి చిట్టాకుల నరేశ్, 'మాపైన దయజూడు బోరు, నువ్వు ఏనాడు ఎండిపోరాదు' అంటున్న 7వ తరగతి గుజ్జం జశ్వంత్, అందరి ఇంట్లో అద్దం తప్పక ఉండును నిజమండి' అంటూ నిజాన్ని చెప్పిన 8వ తరగతి బాలిక వన్నెల అక్షయ, దానమివ్వకున్నను పుణ్యమేమీరాదు" అంటూ హెచ్చరించిన 8వ తరగతి తోకల నవ్య, బ్యాటు చేత పట్టెదము" అంటూ 9వ తరగతి బట్టు అఖిల్, చిన్న చీమలైనను పెద్దనీతి దొరుకును అంటూ చీమలపై 10వ తరగతి పోతిరెడ్డి నందిని, మన ఆస్తి బస్సండి బస్సును కాపాడండి అంటూ బస్సు గురించి 10వ తరగతి కోల మనీష, ఫ్యాను గురించి 10వ తరగతి వన్నెల వర్ష, ఈ సంకలనంలో కవిత వ్రాయటానికి అర్హతలేని అంశం అనేది లేదని గుజ్రాల గొంది బాల కవులు శ్రీశ్రీ కవితా చరణాన్ని గుర్తు చేసారు. వీరిలోనూ 82 సంఖ్యలో 50 మంది బాల కవయిత్రులున్నారు.




చౌదర్‌పల్లి విద్యార్థుల కవితా సంకలనం **గడ్డిపూలు**లో, 28 కవితలు చోటు చేసుకున్నాయి. 18 కవితలు బాలికలే వ్రాసారు. యించుమించు అందరూ 10వ తరగతి విద్యార్థులే కావటంతో కొంత రచనా పరిణతి కనపడుతోంది. తొలి కవిత స్నేహంలో, మాటలతో పుట్టి మట్టిలో కలిసేవరకు తోడుగా నిలిచేది అని యాలాల జయమ్మ అంటే ఆఖరి కవిత అమ్మ ప్రేమలో అమ్మలేని జీవితం చిరిగిపోయిన కాగితం అంటాడు. 9వ తరగతి విద్యార్థి వడ్లా సుభాష్. కనిగెరి సుశీల, 'పండుగ రోజు' కవితలో మాట తప్పినోళ్లకు పెట్టాలోయ్ వాతలు" అంటూ అవినీతి లేనిరోజు పండుగరోజు అంటారు. 'మార్పు కోసం' కవితలో నేనావత్ స్వప్న నాయకులారా! ఇప్పటికైనా మీరు మారండి. ప్రజల మేలును కోరండి అంటూ హెచ్చరిక వినిపిస్తుంది. పోలేపల్లి ప్రశాంత్ ' మా ఓటు' కవితలో మోసపోము మీ నోటుకు తాకట్టు పెట్టము మా విలువైన




ఓటును" అంటాడు. "ఓ కామాంధులారా! మృగాలు కూడా మిమ్మల్ని చూసి తలలు దించుకొంటు న్నాయి" అంటూ 'మారండి' కవితలో వ్యసన బానిసలను నేనావత్ స్వప్న హెచ్చరిస్తారు. గొల్ల పావని 'అమ్మ ప్రేమ' అనిల్‌కుమార్ 'అమ్మా నాన్న' యాలాల జయమ్మ 'నాన్న' పల్లెర్ల అనిల్‌కుమార్ 'నాన్నంటే', సంజనోళ్ళ నందిని 'గెలిపించే నాన్న', యాలాల పావని 'నేనుండలేను' కవితలన్నీ తల్లిదండ్రుల బాంధవ్య విలువలకు సంబంధించినవే డా॥ పత్తిపాక మోహన్ తొలి పలుకులలో పేర్కొన్నట్టుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ బడిపిల్లల రచనలు, బంగారు బాల్యం పూయించిన స్వర్ణ కవితాక్షరాలు.

ప్రతులకు: ★ మధురపద్మాలు ★
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జక్కాపూర్
మం॥ నారాయణరావు పేట, జి॥ సిద్దిపేట–502 276
సెల్: 9959007914
★గుజ్జాల గొంది★
వరుకోలు లక్ష్మయ్య, గ్రా॥ గట్టమాల్యాల, మం॥ నన్‌గునూర్
జిల్లా: సిద్దిపేట– 502 280. సెల్: 9704865816
★గడ్డిపూలు★
వెన్నెల సత్యం
పాఠశాల సహాయకులు (తెలుగు)
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
చౌదర్‌పల్లి.
సెల్:9440032210



–జయసూర్య
సెల్: 9440664610

# విశ్వమారి చేతుల్లో చిక్కిన విశ్వం

## దృశ్యాలు

గది లోఅ మనిషి దగ్గ
అసహాయంగా చాతీ నిమురుకుంటూ
గది బయట ఎక్కిళ్ళ శబ్దం రాకుండా
ఇద్దరి ఏడుపు.

నిశ్శబ్దం మరో రూపైన ఆ పార్క్ లో
మోకాళ్ళు దగ్గరకు చేర్చుకు కూర్చుని
వీధి వీధంతా, నగరం మొత్తం లో
ఎంతమంది పని పోగొట్టుకున్న వారు ఉన్నారో ...

బారులు బారులుగా నడుస్తున్న మనుషులను చూసి
చీమలు ఎంతగా ఆశ్చర్యపడ్డాయో
మరో ప్రకట వెలువడ్డాక
మళ్ళీ అనంతమైన బారులుగా
వెనక్కు నడుస్తారు వాళ్ళు

ఒక నగరంలో సెల్ఫోన్ టవర్
మంటల్లో కాలి బూడిదయింది
మరో నగరాన బయట వరండాలో
అపరిచిత పావురానికి మేత వేస్తున్నాడో మనిషి
ఇంకా సజీవంగా ఉన్న ఎవరి గురించో
వార్త మోసుకు వచ్చింది అది.

కొంతమంది వృద్ధులు
మూసిన సూపర్ మార్కెట్ ముందు నిల్చుని ఉన్నారు
పెనుగాలి ఒకటి
ఖాళీ షెల్ఫ్ లను ఓ సారి చూసి
వారిని దాటుకుని వెళ్ళింది.

ఒక పెద్ద గోతి పక్కన
ఒక శవాల గుంపు నిరీక్షిస్తూంది.
హడావిడిగా లోపలికి తోసి
వాళ్ళు వాన్ ఎక్కారు.
వదిలేసిన ఒక శవం మూలుగులు
వాహనంలో మనిషి ఒకడు వెనక్కు చూసాడు
అది అతని కళ్ళలొ పడింది.

## చెన్నై వదిలేస్తూ....

నగరం నుండిబయటకు వెళ్ళే దారుల్లో
ఉద్విఘ్నమైన రహదారులు
పొంగిపొర్లుతున్నాయి వాహనాలతో
వాటికి అనుమతి ఇవ్వలేదు
నేను వాటిల్లో దేంట్లోనూ లేను.
అలాగని అదేదీ ఎక్కాలనీ అనుకోడం లేదు
నగరం ఎముక నుండి వేళ్ళాడుతూ
ఇప్పుడు నాకు కావలసినది
ఏదో ఒక మాయా విచిత్రం.
ఎవరో ఒకరు నన్ను మెరిసే ఉప్పుగా మారిస్తే
మళ్ళీ మరోసారి బంగాళాఖాతం లో కలుస్తాను.
శాంతోమ్ ను ముట్టుకుని తీరానికి వెళ్తూ
జ్వాలానక్షత్రం రవిబింబం పాదాలనెక్కుతాను
ఖాళీ చూపుతో ఎక్కడో నిల్చుని
ఏకాంతంగా వదిలేసిన విచారగ్రస్థపు తీరాన
అక్కడ స్థిరపడిపోతాను
మే మాసపు ఉప్పులో కలసిపోతున్న ఎముకల ఉప్పుతో
అంటే ఈ క్షణాన
నువ్వు, అతను, ఆమె, వాళ్ళు, వీళ్ళు
ఇక్కడున్న వాళ్ళందరూ

## కొన్ని నెలల తరువాత నగరం

డైబ్బై ఏళ్ళ స్త్రీ ఒకరు
ఎప్పుడు ఇల్లుదాటడానికి అనుమతిలేని ఆమె
టవున్ మధ్యలో
పార్క్ సందర్శనకు వెళ్తుంది
విరిగిన చెక్క బల్ల మీద కూచుని
ఉదయపు ఎండలో వెచ్చదనం అస్వాదిస్తుంది
చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు
పార్క్ చుట్టూ వేగంగా నడక సాగిస్తారు.
వారికి మధ్య ఆరడుగుల దూరం
అనివార్యంగా వదులుతారు
ఒకరినొకరు చూసుకోడం తప్పించుకుంటారు
ఆ స్త్రీ తలెత్తి చూస్తుంది.
పరిచయమున్న కాకులు కొన్ని
పైన ఎగురుతూ తిరగడం కనబడతుంది
వాటికే తన బాధలు ఫిర్యాదు చేస్తుంది ఆమె.
కొన్నాళ్ళుగా తనకోడలు తనను సగం మాడుస్తోందని
ఈ మధ్య కోడలు ఆఫీస్ కు వెళ్ళడం లేదట
ఆమె చెప్పింది
"నా కొడుకు ఒక తెలివితక్కువ వెధవ "
అమె గొణుగుతూ చెప్తుంటే
కాకులు నెమ్మదిగా కిందకు దిగాయి.
అవి ఆమె చేతుల వైపు చూసాయి
వాటిల్లో ఏమీ లేదు
ఆమె ఇంకా ఫిర్యాదు చేస్తూనే ఉంది
అవి మాత్రం తొందరలో ఉన్నాయి
ఒక కాకి ఆమె చెక్కిలిపైకెక్కి దాని పొడిచింది.
త్వరగానే మరొకటి వచ్చిదాన్ని చేరింది.
వాటిని తరిమెయ్యాలని చూసిన ఆమె రెండు చేతులనూ
మరో రెండు కాకులు చీల్చేశాయి
పార్క్ లో నడుస్తున్న వాళ్ళు నడుస్తూనే ఉన్నారు
ఒకరికీ మరొకరికీ మధ్య
ఆరడుగుల దూరం పాటిస్తూ
ఆరడుగుల దూరాన
కాకులు వాటి ఆహారం తినేందుకు
సిద్ధపడుతున్నాయి.

## ఊహించినదేదీ అతిశయోక్తి కాదు

శ్మశానంలోఅనాధలమల్లే పూడ్చిపెట్టిన శవాలు
లేచి గుంపులు గుంపులుగా ఒకప్పుడు
వారికి పరిచయం ఉన్న టౌన్ కు పరుగెత్తుకు వస్తున్నాయి
శరీర ఉష్ణోగ్రత చూస్తున్న డ్రోన్ లవైపు
ఏనుగులు చూస్తున్నాయి
ఒక గుంపు నగరపు ధమని దారిని దాటింది.
ఉబ్బిపోయిన చందమామ
దాని మెడ నుండీ చావు పాడే వేళ్ళాడుతూ ఉంటే
కుడి ఎడమలవైపు చూస్తోంది

ఒక గుహ నుండి
ఇద్దరు మనుషులు శరీరమంతా బిరుసెక్కిన జుట్టుతో
బయటకు వచ్చారు
ఆరోజుకి వారు నిప్పు వెదుక్కోవాలి

" ఊహించినదేదీ అతిశయోక్తి కాదు"
ఎప్పుడూ రోగం అంటే తెలియని
ఒక గులాబీ తోట
తల ఊపుతూ
పాటగా విస్ఫోటిస్తుంది
తనపని తాను చేసుకునే ఒక సీతాకోక చిలుక
మధువును పీల్చుకు ఖాళీ చేస్తుంది
ఒకప్పుడు దేవుళ్ళు మనుషులకెలాగో
సీతాకోక చిలుకలు గులాబీలకు అంతే.

## పాతాళంలో నిలబడి

నా గొంతు వెనకాల
పదాలు పెల్లుబికాయి
" నన్ను కాపాడి రక్షించండి"
వాటి మొత్తం మింగేశాను
రోజంతా పొగ కమ్ముకుంది
ప్రపంచం అంతా పొగతో నిండిపోయింది
ఏదీ స్పష్టంగా కనబడటం లేదు
చేతులన్నీ తడబడుతున్నాయి
కాలం కాని కాలం లో ఉండటం పాతాళంలో ఉండటమే
ఇక్కడ చీకటికి ఎలాటి విశిష్టతా లేదు.
నేను రక్షణకోసం అరచినప్పుడు
నా స్వరం నాది కాదు
పాతాళంలో
దేన్నించి నేను రక్షణ కోరతానో
అది నన్ను రక్షించేదే.
అదే రక్షణ అడిగేదీ
అది నేను కాదు.

## సాధారణం

నిజంగా నాకిప్పుడూ ఏమీ అవసరం లేదు
కాస్సేపు గాఢమైన నిద్ర చాలు
వీలైతే నిద్రలో ఒక కల
ఆ నిద్రలో నేను సందర్శించేది
కొందరు మిత్రులతో ఒక రెస్టారెంట్
ఎప్పుడూ మేం వెళ్ళే ఒక రెస్టారెంట్
ఎప్పటిలా కొంచం తాగి
ఎప్పటిలా చాలా చాలా నవ్వుకుని
ఎప్పటిలా అర్ధరాత్రి బయటకు వస్తాం
ఊబర్ కోసం ఎదురుచూస్తున్నప్పుడు
నా మిత్రుడు ప్రేమగా పొడుస్తాడు
మరో మిత్రుడి పెల్లుబికిన పొట్టతో ఓ పోటు
వాడు నవ్వులుగా వెదజల్లుతాడు
ఆపైన మేం విడిపోయి ఎవరిదారి వాళ్ళు పడతారు
జాగ్రత్తగా గమనించండి
ఈ స్వప్నంలో నా ప్రేమికులు కనబడరు
కనిపించిన మిత్రులు కూడా
నాకు మరీ ఆప్తులు కారు
కాని ఇప్పటికీ స్వప్నం చాలు
ఈ పాతాళం నుండి మరో పాతాళానికి
అట్టడుగు మెట్టుపైనుండి
పై కెక్కడానికి
ఓ చిన్న తాడు.
అక్కడి నుండి చూస్తే
ఒక చిన్న వెలుగు రేఖ
ఇది కలే ఐనా
మరో దారేదీ లేదు.

## ఇప్పటికీ నీలంగా ఉండే ఒక ఆకాశం ఉంది

ఆ ఆకాశం కింద
ఇద్దరు యువతులు చేతుల్లో బాస్కెట్ లతో
ఉల్లాసంగా నడుస్తున్నారు
ఒకరినొకరు చూసుకుంటూ
మాట్లాడుకుంటూ
ఒక షాప్ లోకి నడిచారు
అక్కడ వాళ్ళు కొన్న బ్రెడ్
ఆ రోజు పరిమళాన్ని పల్లవిస్తుంది
వాళ్ళు సీసాలలో పాలుకొన్నారు
కూరగాయలూ కొన్నారు
ఒకరినొకరు మేస్తు మాట్లాడుకుంటూ
వెనక్కు నడిచారు
ఆ ఆకాశం నుండి
రెప్పవాల్చకుండా చూస్తున్నాడు రవి
ఆ ఇద్దరు యువతులవైపు
అక్కడి నుండి పక్కకు వెళ్ళే ఉద్దేశ్యమే లేకుండా
అది ఎలాగైనా అనే ఈ రోజును పరిష్కరిస్తుంది
మరో ఆకాశం లో ప్రయాణించే వేళ
అది మాత్రం కళ్ళు మూసుకుని తీరాలి.

## దయచేసి ఎవరో ఒకరు చెప్పండి

ఇప్పటికి కొద్ది రోజులుగా
ఈ గదిలో
నేను నడుస్తున్నాను
తలుపే గోడగా మారింది
ఈ గది దాటి మరో ఇల్లేదయినా అసలు ఉందా?
బయట మరో నగరం అనేది ఉందా?
నగరంలో గుళ్ళూ బీచ్ లూ ఉన్నాయా?
సముద్రంలో అలలింకా ఎగిసిపడుతున్నాయా?
నాకు తెలీదు
ఈ కొన్ని రోజుల్లో మామూలుగా
వేలమంది జనాలు
మరణించే ఉంటారు.
ప్రమాదాలు, హత్యలు, కాన్సర్, గుండె నొప్పులు
అవన్నీ ఏమైపోయాయి
ఆ శవాలకు ఏమైంది?
ఈ గదిలో
నా అడుగుల వేగం పెరిగింది
ఒకమెట్టు నుండి మరో మెట్టుకు
ఎగిరి మళ్ళీ కిందకు వాలతాను
చెద పురుగులా
చావు కోసం శ్రమపడతాను
నా శవం ఏమవుతుందో నా కిప్పుడే తెలవాలి.

## ఏదో మారిపోయింది

నేను కాఫీ కప్పు కూడా పట్టుకోలేను
మనసులోని వణుకు శరీరానికీ సోకింది.
నగరపు వణుకు మనసుకు సోకింది
ప్రపంచమంతా వణుకుతోంది
కాకులుకొన్ని కలసికట్టుగా అరుస్తున్నాయి
కాదు, అవి ఒక శోకాన్ని రోదిస్తున్నాయి
ఇది ఎప్పటిలా మామూలు ఉదయమే.
ఈ కాకుల గుంపు రోజూ వస్తుంది
ఇది వాటి ఎప్పటి అరుపే.
ఏదీ మారలేదు
ఏదీ మారలేదు
ఇది రెండుసార్లు నువ్వు చెప్పాల్సి వచ్చినప్పుడు
నీకు ముందే తెలుసు
ఏదో మారిపోయిందని

## ఇచ్చిన గడువుకు ముందు నా వ్యాసం సమర్పించలేను

కారణం
మా నాన్నఒక హాస్పిటల్ లో ఐసీయూ లో ఉన్నాడు
మా అమ్మ కోవిడ్ పాజిటివ్
పక్క గదిలో పడుకుని ఉంది
నా పిల్లిపిల్ల చనిపోయింది
ఆ వైరస్ పిల్లులకూ సోకుతుందా?
నాకు కంప్యూటర్ లేదు
మరెలా వ్రాయగలను?
ఇంట్లో ఒక గొడవ
మానాన్న అమ్మ ముక్కు బద్దలుకొట్టాడు
మా వీధిలో ఈ రోజు అయిదు శవాలు వచ్చాయి
నేను క్వీన్స్ వీధిలో ఉంటాను
ఎప్పుడూ చూసినా అంబులెన్స్ సైరన్ల శబ్దమే
ఏం వ్రాయాలో నాకు తెలియదు , సరేనా?
ఒక పారగ్రాఫ్ రాస్తే
నాకు భయంగా ఉంటుంది.
హనుమాన్ నా కలలోకి వచ్చాడు
ఆయనే మనందరినీ రక్షిస్తాడు
జీసస్ నాకలలో కనిపించాడు
అతను విచారంగా చూశాడు
ఇది ఎలాఉన్నా
నా వ్యాసానికి నాకు మీరు
ఏం ఇస్తారని ఎదురు చూడనా?
మీ క్లాస్ ఏ మాత్రం
మిస్ అవకుండా జాగ్రత్త పడతాను
ఇంటికి దగ్గరలో ఉన్న కాలేజిలో చేరమంటున్నారు
అమ్మా నాన్నా
మా దేశపు జనాలు మాకొక విమానం పంపలేదు
వాళ్ళు మమ్మల్ని వదిలేసారు
నేను మిత్రుల ఇంట్లో ఉంటున్నాను
వాళ్ళు నాకు తిండి పెడతారు
సూపర్ మార్కెట్ లో సీరియల్ ఒక పాకెట్ మాత్రమే ఉంది
సూపర్ మార్కెట్ మూసేస్తున్నారా?
ఎండ వేడిగా ఉంది
నా కుక్కపిల్ల బయట ఆడుకుంటోంది
నేనెందుకు వ్యాసాన్ని రాయాలి?

## అమ్మలారా! అయ్యలారా!

వాళ్ళంటున్నారు -వైరస్ గాలిలో కలిసిందని
అయినా గాలి ఎప్పుడో కలుషితం అయ్యింది
వాళ్ళంటున్నారు వైరస్ నీటిలోనూ కలిసిందని
ఎప్పుడు నీరు స్వచ్ఛంగా ఉంది గనక?
ప్రతివాళ్ళు చైనాను దుయ్యబడుతున్నారు
నేనూ వారితో పాటే తిడతాను
అమెరికా ప్రజా ఆరోగ్య రక్షణ పూర్తిగా విఫలం అని
వాళ్ళు అరుస్తున్నారు
వారితో నేనూ అరుస్తాను
వ్యక్తిత్వం పోగొట్టుకుని.
నాకు అనుమానం
ఈ ప్రపంచపు దేశాలు
ఇప్పుడు, మళ్ళీ మరోసారి, నా నాలుకను దొంగిలించాయి
ఆ వైరస్ నా రక్తంలో కలసిపోయిందని
లోపలకు ఎగిరివచ్చి
ఈ ఉదయం నా వసారాలో వాలిన
నా వైపు వింతగా చూసే
పక్షికి కూడా వైరస్ సోకినట్టుంది
నన్ను చూసి కూడా అది ఎగిరిపోలేదు
ఎగురుతూ నా వైపు వచ్చింది
నా సందేహం ధ్రువీకరించబడింది
ఆ పక్షిని వైరస్ సోకితే
నాకు అనుమానం ఏమీ లేదు
వైరస్ ఆకాశానికీ సోకుతుంది
చుక్కలకూ సోకుతుంది
దేవుణ్ణి నమ్మండి మానండి
మనముందు ఇంకో అవకాశమే లేదు.

-పేరుందేవి
ప్రముఖ తమిళ కవయిత్రి.
ఎనిమిది కవితా సంకలనాలు ప్రచురించారు.

-ఎన్. కళ్యాణ్ రామన్
తమిళ కవిత్వాన్ని ఫిక్షన్
అనువాదకులు.



-స్వాతీ శ్రీపాద
8297248988

పుస్తక సమీక్షలు

# చీరాల ప్రాశస్త్యానికి అక్షర హారతి..!




చీరాల పట్టణం ఆవిర్భవించి నాలుగు శతాబ్దాలు పూర్తయిన సందర్భంగా.. 'చీరాల సహజ సాహితి' వారు.. అనేక అడుగులు ఒక ప్రస్థానం' పేరుతో చీరాల కవిమిత్రులతో కలిసి.. ప్రముఖ సాహితీవేత్త వడలి రాధాకృష్ణగారి సంపాదకత్వంలో ఓ కవితా సంకలనాన్ని వెలువరించారు.

ఆధ్యాత్మికవేత్తగా, విద్యాదాతగా, సేవా తత్పరునిగా, మానవతావాదిగా చీరాలలో భాసిల్లుతున్న శ్రీ ముర్వల శివప్రసాదరావు శ్రీమతి పద్మావతి దంపతులకు అంకిత మివ్వబడిన ఈ చిన్ని పుస్తకంలో.. చీరాల ప్రాశస్త్యానికి చీరాల సృ.జనకారులు అక్షరహారతి పట్టారు.

చీరాల గొప్పదనాన్ని.. చీరాల ప్రముఖ్యతను.. చీరాల దేవాలయాలను.. చీరాల ప్రాంత ప్రజల జీవనచిత్రణ.. చీరాల పేరాల ఉద్యమం నాటి జ్ఞాపకాలు.. జనాభా, నైసర్గిక స్వరూపం.. ఈ గడ్డపై జన్మించిన ప్రముఖులు,.. ఈ నేలకు వన్నె తెచ్చిన కళాకారులు.. క్రీడాకారులు.. కవులు.. నటులు.. చేనేత మగ్గాలు.. హొయలొలికించే.. ఓడరేవు, వేటపాలెంలోని సారస్వత నికేతనం.. జీడిపప్పు పరిశ్రమ ఇలా ఇవన్నీ చీరాల ప్రాభవానికి ప్రతీకలుగా నిలిచాయనీ.. కవులు తమ తమ కవితల్లో ఎలుగెత్తి చాటారు.

చీరాల అస్తిత్వ కీర్తి పతాకను అక్షరాల్లో బంధించి.. అందరినీ అలరించేలా ఇందలి రచనను కొనసాగించే విధంగా.. సంపాదకులు వడలి రాధాకృష్ణగారు తీసుకున్న శ్రద్ధ శ్లాఘనీయం.. 'సహజ సాహితి' సంస్థ ద్వారా ఎనలేని సాహిత్య, సామాజిక సేవ చేస్తున్న రాధాకృష్ణ గారు.. ఇప్పుడు చీరాల వైభవాన్ని చాటి చెబుతూ.. ఈ సంకలనాన్ని తన సంపాదకత్వంలో ప్రకటించడం ప్రశంసనీయం..

ఈ పుస్తకంలోని కవితల్లో 'క్షీరపురి' మట్టి వాసనలను గుబాళింపజేయడంలో కవులు సఫలీకృతులైనారు. చీరాల పట్టణ ప్రాచీనతపాటు.. ఐక్యతను.. తరతరాలు అన్ని సామాజిక వర్గాలవారు సామరస్యంతో జీవనయానం కొనసాగించడాన్ని కవులు తమ కవితల్లో ప్రస్తావించారు. ప్రస్తుతించారు.

కవులు చీరాల ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను.. అక్షరాల్లో ఆవిష్కరించారు.

మహనీయులు గన్న పుణ్యభూమి చీరాల అంటూ డా॥సత్రం మల్లేశ్వరరావుగారు తమ కవితను తీర్చి దిద్దారు. చీరాల దేవతా దీప్తిని చింతగుంట సుబ్బారావుగారు చాటి చెప్పారు. చీరాల వైభవాన్ని వెల్లంపల్లి దాశరథిగారు తమ రచనల్లో ప్రతిబింబింప జేశారు.

డా॥ బీరం సుందరరావుగారు చీరాలతో తమకున్న దశాబ్దాల అనుబంధాన్ని.. అనుభవాలను.. అనుభూతులను మనతో పంచుకుంటూ.. చీరాల ఘనకీర్తిని చాటి చెప్పారు.

'మా వూరు' పేరుతో అచ్యుతుని శంభుప్రసాద్గారు ఓ గేయం రాసి మెప్పిస్తే.. చీరాలకు పొగాకు పరిశ్రమతో వచ్చిన కీర్తి ప్రతిష్టలను దివి పాండు రంగారావుగారు తమ "తల్లికంపెనీ" కవిత ద్వారా తెలియజెప్పారు.

"చీరాల చంద్రోదయం" శీర్షికతో వెలుగు వెంకట సుబ్బారావుగారు రాసిన కవితల్లో తమ అనుభూతులను మనతో పంచుకున్నారు. కవిరాజు కడెము వేంకట సుబ్బారావుగారు.. నిత్య అన్నదాన పథకంపై రాస్తే.. యర్రమిల్లి విజయలక్ష్మిగారు.. సముద్రతీర నేపథ్యాన్ని వివరించారు.

పాలకుల నిర్లక్ష్యానికి గురైన అభాగ్యుల గురించి ప్రస్తావిస్తూ.. జంపాల గంగాధరరావుగారు.. తమ కవిత ద్వారా చేనేతలకు ఏది చేయూత? అని ప్రశ్నించారు.

స్వర్ణ ప్రయాగరావుగారు చీరాల ప్రాంత వేటపాలెం జీడిపప్పు రుచులను చూపించారు.

చీరాల పేరాలకు ప్రాస "ఆంధ్రరత్న" దుగ్గిరాల అంటూ తమ కవితను రాశారు.

'నిర్వాణ సంకేతం' శీర్షికతో రాసిన కవితలో డా॥ ధేనుకొండ శ్రీరామమూర్తిగారు జ్ఞానేంద్రియ మౌనంతో ఆశల దారం తెగుతూ ఉంటుందని వాపోయారు.

చీరాల నాడు-నేడు ఎలా ఉందో.. యస్వీఆర్ రాజేశ్వరశర్మగారు ఆవిష్కరిస్తే.. చీరాల మాకు ముగ్ధమనోహరం.. స్వర్గధామం... చీరాలతోటి అనుబంధం.. తీపి జ్ఞాపకాల విందు భోజనమంటూ చింతగుంట ఉదయ పద్మగారు రాశారు.

చీరాలను రత్నఖనిగా వర్ణిస్తూ వంగర శ్రీధర్గారు రాస్తే.. దుగ్గిరాల శౌర్య పటిమకు పట్టం కడుతూ యం.వి.ఎస్. శాస్త్రిగారు. అతడే ఓ సైన్యం అంటూ కొనియాడారు.

చీరాల అట్టు.. ఒక పట్టు పట్టు.. అంటూ షేక్ రఫీగారు చీరాల పెద్దరథం దాటాక.. గద్ద మేడ బజార్లో పొద్దున్నే ఘుమ ఘుమలాడే అట్లను ప్రస్తావిస్తే..

'నూరేళ్ల నా ప్రేయసి కోసం" శీర్షికతో సజ్జా వేంకటేశ్వర్లుగారు రాసిన కవితను సారస్వత నికేతనమా.. నూరు వసంతాల మహా సముద్రమా! అంటూ ప్రారంభించిన తీరు బాగుంది.

పూర్వ పరంపరలో సింధు సమీపాన సహేతుకమై.. కుటీర పరిశ్రమకు కేంద్రమై... చేనేత మగ్గానికి ప్రమాణమై.. సుధామ నగరము.. క్షీరపురిగా ఆనక.. చీరాలగా సాంస్కృతిక ప్రమాణంగా భాసిల్లుతున్న చీరాల ఘనకీర్తిని చాటుతూ "వాస్తవాల ముంగిట" శీర్షికతో వడలి రాధాకృష్ణగారు కవితను రాశారు. జాతికి జీవికగా వాస్తవాల ముంగిట కాలదర్పమై.. యవనిక తాలూకు యశస్సును చీరాల విశ్వ శోభితం చేస్తూనే ఉందని ప్రస్తుతించారు.

మగ్గాల యదార్థ కన్నీటి గాథలకు అద్దంపడుతూ పసుమర్తి లలితా నరశింగరావుగారు రాస్తే.. కోన రమణారావుగారు క్షీరపురి సంస్కృతీ వైభవాన్ని చాటి చెప్పారు. చీరాలకు కీర్తి ప్రతిష్టలను సంపాదించి పెట్టిన చిత్రకారులు.. నటులు.. విధ్వాంసులను ప్రస్తావించారు. నాగభైరవ కోటేశ్వర రావుగారి అవిరళ ఆంధ్రభాషా కృషికి 'గురుభ్యో నమః!!' శీర్షికతో పోగుల జయశ్రీగారు క్షీరపురి అక్షర నీరాజనం సమర్పించారు.

గాంధీ పాదధూళి తాకి.. పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న పుడమితల్లి 'నా క్షీరపురం" అంటూ "జన్మస్థలి" శీర్షికతో వంగర పరమేశ్వరరావుగారు ఓ కవితను రాశారు.

అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తిగారు క్షీరపురం విద్యాలయాల ప్రాశస్త్యాన్ని తమ కవితలో ఆవిష్కరించారు.

చక్కని చుక్క చీరాల అంటూ డా॥కందేపి రాణిప్రసాద్గారు కొనియాడారు.

చారిత్రక పట్టణమైన చీరాలలో శ్రమజీవన నేపథ్యానికి ప్రతీకగా నిలుస్తున్న చెక్కబండ్లను, రెండు టైర్ల బండ్లను ఉన్నతంగా చిత్రిస్తూ.. పోలగంగు ఆనంద్గారు రాశారు.

ప్రకాశం జిల్లాలోనే తలమానికంగా నిలిచిన పెరిరాస్: ఇంగ్లీష్ మీడియం స్కూల్పై చయనం మహాలక్ష్మిగారు రాస్తే.. పి. శ్రీనివాస్గౌడ్ చీరాల మట్టితో ఉన్న అనుబంధాన్ని తమ కవితలో ఆవిష్కరించారు.

ఆంధ్రకేసరి చీరాల వారేనండోయ్ అంటూ ఓ కవితను దుగ్గరాజు లక్ష్మీ పద్మజగారు రాశారు.

వేటపాలెంలో సారస్వత కేతనంగా భాసిల్లుతున్న.. జ్ఞానాలయాన్ని ప్రస్తుతిస్తూ కాకుమాను సుధాకర్గారు ఓ కవితను రాస్తే.. ఛందోబద్ధ పద్యాల ద్వారా చీరాల వైభవాన్ని చలకపాటి శ్రీనివాసాచార్యులుగారు ఎలిగెత్తి చాటారు.

దుగ్గిరాల వారిపేరున వెలసిన చలన చిత్ర వేదికను ప్రస్తావిస్తూ.. పూర్ణా హెూటల్ సాంబారు ఇడ్లీ, తిని గోపాలకృష్ణ సినిమా హాలులో చూసిన సినిమాలను ఏకరువు పెడుతూ బత్తుల పాపారావుగారు ఓ కవితను రాస్తే.. చీరాలకు చిన్న ముంబై బిరుదు సార్థకం చేసి కీర్తినార్జించి పెట్టిన మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ను 'పచ్చల హారం' కవిత ద్వారా అన్నంరాజు వరలక్ష్మిగారు చక్కగా విశ్లేషించారు. కామరాజుగడ్డ సాయిగోపాల కృష్ణగారు, మంగళగిరి పిచ్చయాచార్యులుగారు, కార్యంపూడి జానకిరామ్గారు సింగరాజు భార్గవిగారు, షేక్ అబ్దుల్ ఖలీల్గారు మరియు వేమరాజు కృష్ణ చైతన్యలు రాసిన కవితలు పుస్తకానికి శోభను కూర్చాయి.

చింతగుంట సుబ్బారావుగారు రాసిన సహజ సాహితి, చీరాల పతాక గీతంతో పుస్తకంలోని రచనలు ముగుస్తాయి- ఇలా చీరాల పట్టణ వైభవాన్ని.. చారిత్రక అంశాలను.. కవిత్వం ద్వారా అందించిన కవులకు అభినందనలు తెలుపుదాం.

ప్రతులకు: గోనెల్ల శేషవరలక్ష్మి
కే/ఆఫ్. ఐటిసి లిమిటెడ్, ఎడిబి
చీరాల-523 157. ఆం.ప్ర.
సెల్: 9490385626

-దాస్యం సేనాధిపతి
సెల్: 9440526644

మహాకవి శ్రీశ్రీ జేజేలు పలికిన

# అంతర్జాతీయ అమరయోధులకు అక్షరాంజలి..!




శ్రీశ్రీ సాహిత్యాన్ని భావితరాలకు అందించాలన్న గొప్ప సంకల్పంతో.. ఎర్రజెండాయే ఎజెండాగా వామపక్ష భావజాలాన్ని బలంగా ప్రకటించడమే ధ్యేయంగా సాహితీయానం చేస్తున్న సింగంపల్లి అశోక్కుమార్గారు. "అశోక నివాళి" 1,2 పేర్లతో తెలుగు అమరవీర సాహితీవేత్తలకు అక్షరాంజలి ఘటించారు. "అశోక నివాళి" 3,4 పేర్లతో.. మహాకవి శ్రీశ్రీ జేజేలు పలికిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అంతర్జాతీయ అమర యోధులకు అక్షర హారతి పట్టారు. 'అశోక నివాళి' నాలుగో భాగం గ్రంథంలో 'అశోక్ నివాళి-3'కు కొనసాగింపుగా మరో యాభై మంది అంతర్జాతీయ అమర యోధులకు నివాళి సమర్పించారు. 'అశోక నివాళి' నాలుగో భాగంలో శ్రీశ్రీ జేజేలు చెప్పిన అంతర్జాతీయ అమరయోధుల జీవన రేఖలను...వారి వారి ప్రతిభా పాటవాలను. ఏర్చి కూర్చి పొందుపరిచారు.

ఈ పుస్తకం యొక్క ముఖ చిత్రం..అంతర్జాతీయ అమరయోధుల అరుదైన వర్ణ చిత్రాలను పొందుపరిచి.. మరింత శోభను కూర్చారు.

శ్రీశ్రీ పట్ల అపారమైన గౌరవాభిమానులను కలిగివున్న సింగంపల్లి అశోక్కుమార్ శ్రీశ్రీ సాహిత్యాన్ని శ్రీశ్రీ ఉపన్యాసాలను.. తదితర రచనలను ఆధారం చేసుకుని.. అమరయోధులకు నివాళి ఘటించారు.

అశోక్కుమార్గారు ఈ పుస్తకంలోని ఎడమవైపు పేజీలో.. ఒక్కో అంతర్జాతీయ అమర యోధుడి ఛాయాచిత్రం.. దానిక్రింద ఆ అమరయోధుని అభివర్ణిస్తూ ఓ లఘు కవితను రాసి పొందుపరిచారు. లఘు కవితలోని నాలుగు పాదాల్లో అంతర్జాతీయ అమరయోధుని జీవన రేఖలను నిక్షిప్తం చేశారు. మూడోపాదం విరుపుతో, నాలుగు పాదాల పదలయ అంత్య ప్రాసలతో లఘు కవితలను రాసి మెప్పించారు.

పుస్తకం చివరన వరుసగా అంతర్జాతీయ అమరయోధుల సంక్షిప్త పరిచయాలను నిక్షిప్తం చేశారు.

పుస్తకంలోని ప్రతి కుడి పేజీలో శ్రీశ్రీ జేజేలులో శ్రీశ్రీ ఆయా ప్రముఖులను, అమరయోధులను ఉద్దేశించి ప్రకటించిన ప్రశంసలను పొందుపరిచారు.

శ్రీశ్రీచే జేజేలు అందుకున్న యాభై మంది అంతర్జాతీయ అమరయోధుల జీవిత విశేషాలను రేఖా మాత్రంగా ఈ గ్రంథం ద్వారా తెలుసుకోగలం..

చార్లీ చాప్లిన్, కారెల్ చాపెక్, బోరిస్ పాస్టర్నాక్, హెూచిమిన్, సెర్గీ స్మిర్నోవ్, క్రిస్టోఫర్ కాడ్వెల్, చేగువేరా, హెన్నీ మిషో, లూయీ, మేక్నీస్ ఫిడెల్ కాస్ట్రో, లారిసా వాసిల్యేలా వంటి వారితో కలిసి యాభై మంది అంతర్జాతీయ అమరయోధులకు శ్రీశ్రీ జేజేలు పలికిన సమాచారాన్ని.. అశోక్కుమార్గారు ఆయా ప్రముఖుల పట్ల గౌరవ భావంతో రాసిన లఘు కవితల్ని ఈ గ్రంథం ద్వారా పాఠకులకు అందించిన తీరు ప్రశంసనీయం.

గ్రంథం చివరన ఆయా రచయితల రేఖామాత్ర పరిచయం, శ్రీశ్రీ పరిచయంతో పాటు.. అశోక్కుమార్గారి సాహితీ ప్రస్థాన విశేషాలను నిక్షిప్తం చేశారు.

అంతర్జాతీయ ప్రముఖుల గురించిన విశేషాలను తెలుసుకునేందుకు ఉపయోగపడే గ్రంథమిది! ప్రతి గ్రంథాలయంలో 'అశోక నివాళి' 1,2,3,4 భాగాలు ఉంచదగినది.

**ప్రతులకు:**ఆలోచన
305, ప్రగతిటవర్స్
వీరయ్యవీధి
మారుతినగర్
విజయవాడ-520 004.
సెల్: 9246277375



-దాస్యం సేనాధిపతి
సెల్: 9440526644

## యువతా మేలుకో !

యువతా మేలుకో !
ఈ జగతి ఏలుకో !
నీ ప్రగతి చూసుకో !
మంచికి, మానవతకు
మారు పేరుగా మనం నిలవాలి
మనం మనం కలిస్తే జనం
జనం జనం కలిస్తే ప్రభంజనం
మనం అంతా ఒక్కటే
మన లక్ష్యం సేవాభావం
మన ధ్యేయం సమైక్య రాగం
మన భావం నవోదయం
మన గీతం సమతా గీతం
యువతా మేలుకో
ఈ జగతి ఏలుకో
నీ ప్రగతి చూసుకో
నేటి యువత కావాలి
భావి తరాలకు స్ఫూర్తి
సామాజిక సేవలో ప్రతి నిత్యం
యువత సేవలు అందరికీ
ఆదర్శం గా ఉండాలి
అనురాగం, అనుబంధం, ఆత్మీయత
అందరికీ పంచాలి.
మనదేశం భారత దేశం
భావి తరాలకు ఆదర్శం
మనం మన యువత కు
ఒక ఆదర్శం కావాలి
యువతా మేలుకో !
ఈ జగతి ఏలుకో !
నీ ప్రగతి చూసుకో !



-ఎల్. ప్రఫుల్ల చంద్ర
63005 46700

## నది మదిలో....

నా నది మదిలో
ఆలోచనా ప్రవాహాలు
ఆగకుండా ఉరుకుతున్నయ్
అందకుండా సాగుతున్నయ్
అందుకే ఆచరణ ఆనకట్టేసిన .
ఆలోచనలు ఇంకాలే
గుండెలోతుల్లో తపనతడి
పెరిగి ఆచరణై మొలకెత్తాలే
విశాలమై విస్తరించాలే
విలువలు గల మనిషిగా ఎదగాలే.
ఆగకుండా ఉరికి
అనంత సాగరంలో కలిస్తే
నీ ఉనికి ఏది..? ఊసేది?
వేల గొంతుకల తాపం తీర్చే
వాడి అయినా వాక్యం ఏది? .
ఆవేదనలు తరంగాలై
అలా తరలిపోతున్నా...తల్లడిల్లకుండా
కాలువలు కట్టాలి..చెరువులు నింపాలి
పచ్చని పంటలై చిగురించాలి...
పదుగురి గుండెల్లోనైనా తడి పెంచాలి
తపనలు తీరాలి...
అది మదైనా... నదైనా.



-వి. పద్మ,
9951445867

## శూన్యం మరచిన మనిషి..

శ్రమ లేని సంపాదన ముందు
కొత్త ఆకలి బిత్తర చూపులు చూస్తోంది-!
సహనం చచ్చుబడి ఎదురొచ్చిన ప్రతి సవాలుకీ
మొండితనపు గుండెలు
మరింత బండ బారుతున్నాయి-
బొట్లు బొట్లుగా రాలిన కోపం
కళ్ళలో కొర్రాయిలా ఎదురు బడుతుంది!
చికిత్సలు లేక రోగాలు
మూల్గులు పోతున్నాయి ..
నీరందక బీళ్లు కడుపులు కుట్టేసుకున్నాయి-
నిరుద్యోగం ఎదురుచూపుల
శూలాలకి గుచ్చుకుని చిక్కి శల్యమవుతోంది-!
కారుణ్యం మరింత కాఠిన్యమై
స్వార్థానికి తాకట్టుబడి మెలికలు తిరుగుతోంది-
దొరకని చిరునామాతో మానవత్వం
మాయల దొంతరాంతరాల్లో
కొత్త రూపు కడుతోంది -
తట్టి చూస్తే ..ఇక్కడ ఓ ఆకారం
శూన్యాన్ని పరిచిన మనిషిలా
మన మధ్య
తచ్చాడుతూ ఉంటుంది-!?



- మోతుకూరి అశోక్ కుమార్
9247380976

